

శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్ : గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 06
సంచిక : 03
భాద్రపద పౌర్ణమి
సెప్టెంబర్ 20 , 2021

## నేపథ్యం

## ప్రధాన పురుషార్థము - ధర్మాచరణ

## ఆషాడ వ్యాస పూర్ణిమ


| శ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం | ఈ సత్సంగంలో శ్రీ సార్ ధర్మాచరణ ప్రాముఖ్యత ను మన జీవన సంఘటనలో ధర్మం విశిష్టతను తెలుపు తారు : https://drive.google.com/file/d/1mMLWTFsfvHmHc5Cn-7mChTwOy4ICTdQi/view?usp=sharing |
|---|---|


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

తన యందు నఖిల భూతము లందు నొకభంగి సమహితత్వంబున
జరుగువాఁడు; పెద్దలఁ బొడగన్న భృత్యునికైవడిఁ జేరి నమస్కృతుల్
చేయువాఁడు; కన్నుదోయికి నన్యకాంత లడ్డం బైన మాతృభావము జేసి
మరలువాఁడు; తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను దీనులఁ గావఁ
జింతించువాఁడు; సఖుల యెడ సోదరస్థితి జరుపువాఁడు;
దైవతము లంచు గురువులఁ దలఁచువాఁడు లీల లందును బొంకులు
లేనివాఁడు; లలితమర్యాదుఁ డైన ప్రహ్లాదుఁ డధిప!



సద్గురు శ్రీ  సుబ్బరామయ్య మహారాజ్ సమాధి



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి



శ్రీ గురు పూజోత్సవం నాడు రుద్రాభిషేకం తర్వాత అలంకరణ తో శ్రీ సార్

**చదువరులకు విజ్ఞప్తి: ఆడియో వినుటకు అండర్లైన్ చేసి వున్న ఆ సెక్షన్ underlined టైటిల్స్ లను క్లిక్ చేయండి.**



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

# విషయ సూచిక



| # | విషయం | పేజీ నెంబర్ |
|---|---|---|
| 1 | సంపాదకీయం | 5 |
| 2 | శ్రీ సార్ ధర్మాచరణ: ఆచరణాత్మక భోధ | 11 |
| 3 | భక్తుల అనుభవాలు | 17 |
| 4 | సార్ తో (సాయి శివ డైరీ) విషయాలు | 22 |
| 5 | శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్ లు | 25 |
| 6 | నిత్య సత్యులు శ్రీ సార్ తో అనుభవము | 27 |
| 7 | మహాత్ముల వాక్యాలు | 32 |


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

# సంపాదకీయం

## ప్రధాన పురుషార్ధము - ధర్మాచరణ

ఓం శ్రీ సాయిరాం

శ్రీ సుబ్బరామయ్య  సార్ సత్సంగంలో తరచూ చెప్పే సంఘటనలు ధర్మాచరణ చేయటానికి, చేయకపోవటానికి జీవితంలో వచ్చే వ్యత్యాసాలను వివరించేవి గా ఉండేవి. మచ్చుతునకకు  శ్రీ సార్ స్కూల్ లో పనిచేసే రోజుల్లో తనకు హెడ్మాస్టర్ గా ఉన్న ఇద్దరి గురించి తరచు ప్రస్తావించేవారు.

ఒక హెడ్ మాస్టర్ పెద్దగా నామాలు పెడతారు.  కానీ ఆలస్యంగా స్కూలుకు రావటం ఆయనకు సహజం. లీవ్ తీసుకున్నప్పుడు రిజిస్టర్ లో సంతకం పెట్టడం చేయరు.  "యధా రాజా తథా ప్రజా" అన్నట్లు  ఇతర టీచర్లు రాకున్నా అడగరు. ఒకసారి ఏక్షామ్ ఇన్విజిలేషన్ టైం లో ఒక రాజకీయ నాయకుల కూతురికి కాపీ కొట్టడం లో సహకరించమని చెబుతూ, శ్రీ సార్ కు  "చూసి చూడనట్లు వదిలేయమని" చెబుతారు.  శ్రీ సార్ కాపీ కొట్టనివ్వలేదని, అది మంచిది కాదని వారి పెద్దవారితో చెప్పారని "ఆయన తొందర పడ్డారు" అని శ్రీ సార్ దే తప్పుగా చెబుతారు. వీరి అధర్మ ప్రవర్తన కు పర్యవసానంగా  "With in 15 years of services he died"  అని చెప్పేవారు.  ఆ మరణం కుడా ఎంతో అనారోగ్యమై  హాస్పటల్లో చేరి మూడు లక్షలు ఖర్చు తో అవుతుంది.  (సర్వీసు సరి పోనందున) భార్యా కు పెన్షన్ కూడా రాదు. తన వృత్తి ధర్మం సరిగ్గా చెయ్యకుండా దాచిన డబ్బు అంతా కూడా ఉపయోగపడక విధి పాలు  అవుతారు. భార్యా బిడ్డలకు అప్పు మాత్రమే మిగిల్చిపోతారు.

మరో హెడ్మాస్టర్ నాస్తికుడు శ్రీ సార్ నియమ పాలనను భక్తిని, అప్పుడప్పుడు హేళన చేస్తారు. కానీ స్కూలుకు అందరికంటే ముందు వచ్చి ఖచ్చితంగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తారు. రిజిస్టర్ ఖచ్చితంగా మెయింటెన్ చేయడం నుండి, పిల్లలకు చక్కగా పాఠాలు చెప్పే శ్రద్ధ వహించడం అన్నీ చక్కగా నిర్వహిస్తారు. ఈయన తన ముగ్గురు పిల్లలకి ఇంటి దగ్గర రోజూ ఒకే సమయానికి కుర్చోని చదవమనే వారు. అ టైం వరకు చదవని వారికి రాని వారికీ పాకెట్ మనీ ఇచ్చేవారు కాదు. ఆ శ్రద్ధ వల్ల వారు వృద్ధిలోకి వచ్చారు. వీరి చివరి రోజుల్లో చక్కగా తిరుగుతూనే చివరి క్షణాల్లో “సీతా” అని వారి భార్యను పిలుస్తూ సునాయాసంగా  మరణిస్తారు. వీరి పెన్షన్ భార్య బిడ్డల కు  చక్కగా ఉపయోగపడుతుంది.

ఈ రెండు ఇన్సిడెంట్లు  చెబుతూ శ్రీ సార్ ధర్మాచరణ వల్ల మన జీవితాల్లో ఎలా తృప్తి శాంతులు కలుగుతాయో, ఎలా తృప్తి శాంతులకు ధర్మాచరణ ప్రధానము అనేది వివరించేవారు.

భగవధారాధన లో  ధర్మాచరణ ఎంత ప్రాముఖ్యమో తెలిపిన ఒక సంఘటన శ్రీ కృష్ణమాచార్యుల వారి ఆచరణలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.  ఒకసారి శ్రీ కృష్ణమాచార్యులవారు  పూజ చేసుకుంటున్నారు. కడుపునొప్పితో మెలికలు తిరిగి పోతూ, తన బిడ్డను ఎత్తుకుని ఒక తల్లి మందుకై  వచ్చారు.  మడి బట్ట లో పూజ లో ఉన్న శ్రీ కృష్ణమాచార్యులు గారు ఏ సంకోచము లేక వెంటనే బయటకు వచ్చి, ఆ పాపని ఎత్తుకొని, ఆమెకు వైద్యం చేసి కొద్దిసేపులో ఆ బాధ నివారణ చేస్తారు. తరువాత ఆ బట్టలతోనే శ్రీ కృష్ణమాచార్యులు పూజ కొనసాగిస్తారు.  వీరి ఆచరణ తనవద్దకు పంపిన

సాటి రూపాలలో ఉన్న దైవము / భగవంతుని అవసరాన్ని (తనిదిగా గుర్తించి / భావించి) మానవత్వం తో సేవ చేయటం - ధర్మాచరణ అనీ, విగ్రహరూపము లోని దైవానికి పూజ కంటే అట్టి ధర్మాచరణ ముఖ్యము, ప్రధానము అని తెలుపుతుంది.

ఈ సంఘటనలు, ఈ మహాత్ముల ఆచరణ-బోధ “ధర్మాచరణ- మానవులకు / మనందరికీ ప్రధానంగా సాధించవలసినది” అని “ప్రధాన పురుషార్థము: - ధర్మము, ధర్మాచరణ” అని తెలుపుతున్నాయి.

ప్రధాన పురుషార్థము ఏమిటి ? / మనకు కావలసినది ఏమిటి ? అనే ప్రశ్న కు సమాధానం శ్రీ మాస్టర్ ముఖ్యంగా “శ్రీ సాయినాధ ప్రభోదామృతము”, “మతం ఎందుకు ?”, అనే పుస్తకంలోనూ మాష్టారి ప్రవచనాలలో “మన ధర్మము- మన కర్తవ్యము” అనే స్పీచ్ లోను విశేషంగా వివరిస్తారు. ప్రధాన పురుషార్థము అంటే పురుషులు / మనుషులు ప్రథమంగా (మొట్టమొదటిగా) కోరుకోవలసినది, సాధించలసినది - ధర్మము, ధర్మము తెలుసుకోవటము, ఆచరించటము - ధర్మాచరణ అని చెప్పారు.

శరీరము- వాని పోషణ కు ప్రకృతిని ఏర్పరచిన భగవంతుడు, ప్రధాన పురుషార్థముగా ధర్మాన్ని ప్రత్యేకముగా ఆర్జించమనటం, ధర్మాన్ని అవగాహన చేసుకొని, ఆచరణలో నేర్చుకోవలసినది గా, సాధించవలసినదిగా ఏర్పరచడము ఏమిటి ? దీనిని కొద్దిగా స్మరించుకుందాం.

మానవుని కనీస అవసరాలు : తిండి, గుడ్డా నివాసయోగ్యమైన ఇల్లు, అని సామాన్యంగా అందరం పరిగణిస్తాము. ఇవి జీవనానికి అవసరం, కానీ ధర్మము ఏ రీతిగా అవసరం ? అనే ప్రశ్న శ్రీ మాస్టారే శ్రీ సాయి ప్రభోదామృతంలో వేస్తారు? ధర్మము మన కనీస అవసరం, ప్రధాన పురుషార్థము ఎలా ? ఎందుకు ? అనేది వివరిస్తారు.

ఈ సృష్టి యావత్తు ఒకే విశ్వ చైతన్యాన్ని ఆధారంగా ఏర్పడినదని, మహాత్ములు జీవించి బోధించిన రీతి "నీలో- నేనున్నాను, నాలో- నీవున్నావు", "అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని రాసుకో అయ్యా" "అంతా భగవంతుడే - అంతా ఆయన సంకల్పం వల్లనే జరుగుతోంది" మొదలగు మహా వాక్యాలు తెలిపేది, అందరిలో నేను-నేను అనే ఆత్మ రూపక గుర్తింపు ఒక్కటే అని. అది ఆ విశ్వ చైతన్యము, భగవంతుడే ! అని, ఆ సత్యాన్ని గుర్తించి, మన ఇంద్రియాల అనుభవానికి అది తెలియకున్నా, ఆ సత్యం పై ఎరుకతో, గుర్తుతో నడిచేది మాత్రమే ధర్మము అని చెబుతారు. సృష్టికి ఆధారమైన సత్యాన్ని ఎరుకతో గుర్తిస్తూ జీవించడంలో జరిగే ఆచరణే ధర్మాచరణ అని, ఇట్టి ధర్మాచరణ నేర్చుకోవడం, సాధించడం వల్ల మాత్రమే సృష్టిలోని అన్ని జీవులు నిరంతరం ఆశించే తృప్తి-శాంతి కలుగుతాయని చెబుతారు.

మానవులమందరము తిండి, నిద్ర, నివాసాలు కనీస అవసరాలని తలచినా, ఆ కనీస అవసరాలలో మాత్రమే ఎవరూ సంతృప్తిపడక పోవటం, ఆనందంగా జీవించ లేకపోవటం, మనకు కావలసినది ఇంకా లభించలేదని, తెలియలేదని ఎరుక (స్పష్ట) పరుస్తుందని ఆరంభించి, శ్రీ

మాస్టారు ప్రవచనాలలో తృప్తి, శాంతులతో జీవించిన వారి నడుగు, మార్గం తెలుపుతారని అని చెప్పి, ఆ మార్గం “ధర్మాచరణ”, అందరిలో అన్నింటి లో ఉన్న “నేను-నేను” ఒక్కటే అన్న ఎరుకతో జీవించటం అది (అదే) అందరికీ కనీస అవసరమని, కనుక ప్రధానపురుషార్థమని చెబుతారు. మనం లౌకికంగా చేసే ప్రయత్నాలన్నీ ఈ విషయాన్ని (ధర్మాన్ని) విస్మరించి చేస్తే ధు:ఖాన్ని తెచ్చిపెడుతాయనీ, అలాకాక ఈ ఎరుకతో చేస్తుంటే, ఆ (సర్వగతమైన చైతన్యమే నేను అనే) ఎరుక మరింత మేల్కొని నిజ జీవితంలో అనుభవానికి వస్తూ, ధర్మబద్ధమైన అర్థము, కామము (కోరికలు) నెరవేరి తృప్తి-శాంతులు కలుగుతాయని వివరిస్తారు. అట్టి ధర్మాచరణ సుదీర్ఘ అభ్యాసంతో దైవానుగ్రహానికీ, సహజసిద్ధమైన చైతన్య అనుభూతికీ, మోక్షానికీ దారితీస్తుందని తెలుపుతారు. ఎందరో భక్తుల ఆచరణ నుండి మహాత్ముల అనుభవాల వరకూ ఈ విషయాన్ని ధృవ పరుస్తాయి.

ధర్మాచరణ లేని తపస్సు, పుణ్యము కూడా దుఃఖ దాయకమని, తపస్వి అయినా తన ద్వేషంతో పక్షిని చంపి పతివ్రత ధర్మంలో సర్వజ్ఞురాలైన గృహిణి, వృత్తి ధర్మం తో సర్వజ్ఞులైన ధర్మవ్యాధుడు వద్ద ధర్మసూక్ష్మం తెలుసుకున్న సంఘటనలు తెలుపుతాయి.

శ్రీ దుర్గాచరణ్ చదువును అభ్యసించటానికి ఎంతో శ్రమతో ఢాకా నుండి కలకత్తాకి వెళ్ళి విద్యార్థి ధర్మం లో నిలిచి విజయం సాధించి, వైద్యవృత్తి ని అవలంబించి మానవత్వంతో ఎందరికో ఉచితంగా వైద్యం చేస్తూ ఉంటారు. విద్యార్థి, గృహస్థ ధర్మాలు చక్కగా ఆచరించిన దుర్గాచరణ్ ను శ్రీ రామకృష్ణ పరమహంస దగ్గరకు తీసుకొని వారిని అనుగ్రహిస్తారు. ఈ సంఘటన ద్వారా ధర్మాన్ని ఆచరించడంలో శ్రద్ధ వహిస్తుంటే, దైవానుగ్రహం వస్తుందని,

మరింత చక్కగా ధర్మాచరణ చేయగల సామర్థ్యం, తృప్తి శాంతులు సిద్ధిస్తుందని తెలుపుతుంది. వీరి వైద్య వృత్తిలో ధర్మాచరణకు సంప్రీతులైన ప్రకృతి, భగవంతుని కృప వల్ల వీరి వద్దకు వచ్చిన రోగులకు వ్యాధి నివారణ అయ్యేది. ఇంటి వద్ద నుండి దాదాపు అరకిలోమీటరు గంగానది వరకు, రోగుల వరుస ఉండేది. ఇలా ఉండగా శ్రీ రామకృష్ణులకు ఒకసారి వీరు ధ్యానం కుదరటం లేదు అని విన్నవించుకుంటూరు. వైద్యులకు ఆలోచనలు వస్తాయి, ధ్యానం కుదురుట కష్టం అన్న మాటను అనుసరించి తన వైద్య వస్తువులన్నింటినీ, మరో ఆలోచన లేక, గంగానదిలో పడవేస్తారు. సద్గురువైన శ్రీ రామకృష్ణులు తన మాటను ఆచరించినందుకు హర్షం వ్యక్తపరచడం, వ్యక్తం చేయడమే కాక వారికి సర్వస్యశరణాగతి, జ్ఞాన స్థితి, అంతటా ఉన్న చైతన్యం పట్ల ఎరుక ప్రసాదిస్తారు.

అంటే ధర్మాచరణ ధ్యేయమైన సర్వగతమైన “నేను” పట్ల ఎరుక ప్రసాదిస్తారు. ఈ సంఘటన ధర్మాచరణ వల్ల లభించిన సద్గురువును ఆశ్రయించాక, సద్గురు ఆదేశమే, వారి వాక్కు పాటించడం- శరణాగతి ధర్మాచరణ సాధించుటకు మార్గమని అట్టి ధర్మాచరణ వల్ల అర్థ-కామ- మోక్షాలు సులభ సాధ్యమవుతాయని తెలుపుతుంది. శ్రీ మాస్టారి ఆచరణ, మరెందరో మహాత్ముల జీవనము ధర్మాచరణ శరణాగతితో సహజ సిద్ధమవుతుందనీ, అట్టి సంపూర్ణ శరణాగతి తో కూడిన ధర్మాచరణ వల్ల తృప్తి-శాంతి రూపమైన భగవత్ అనుభూతి కలుగుతుందని తెలుపుతాయి.

# శ్రీ సార్ ధర్మాచరణ : ఆచరణాత్మక బోధ

ప్రధాన పురుషార్థము అయిన ధర్మాన్ని శ్రీ సార్ ఉగ్గుపాలతో జీర్ణించుకుని ఎలా ఆచరించి మార్గదర్శకంగా నిలిచారో ఇచ్చట వివరించు కుందాము.

## మానవత్వమే ధర్మాచరణకు నాంది

శ్రీ సార్ కు (ఆధ్యాత్మికత పెద్దగా పరిచయం లేని) చిన్నతనం నుండి కూడా ప్రస్ఫుటంగా జీర్ణించుకొని ఉన్న, వ్యక్తమయ్యే సద్గుణం మానవత్వము. ఇతరులు బాధతో ఉంటే (ఆ బాధ తనదిగా భావించి) తన శక్తికి మించి సాయం చేయకుండా ఉండ లేకుండటం. శ్రీ సార్ ఆడుకునే రోజులలో ఒక పెద్ద ఆమె ఒంటి నిండా జిలతో బాధపడుతూ అరుస్తూ ఉంటే ఆమెకు ఎవరూ సహాయం చేయకుంటే, శ్రీ సార్ వాళ్ల అమ్మగారికి తెలియకనే (చెప్పకనే) ఐస్ కి డబ్బులు అడిగి ఆ పెద్ద ఆమె కు ఇచ్చి నెల్లూరుకి రమ్మని చెప్పి, శ్రీ సార్ సైకిల్ మీద నెల్లూరు వెళ్లి, గవర్నమెంట్ హాస్పటల్ లో చేర్పించారు. వారం రోజులలో ఆమె పూర్తిగా ఆ బాధ నుండి విముక్తి చెంది ఆరోగ్యంగా ఇంటికొచ్చి అందరికీ చెబుతుంది.

అలానే శ్రీ సార్ చదువుకునేటప్పుడు బయాలజీ ఎగ్జామ్ కు వెళుతూ దారిలో ఒక ఆమె కాలు లో ముల్లు దిగి ఎంతో బాధతో మూలుగుతుంటే, అందరూ పెద్దవాళ్ళు ఏమీ చేయలేక చూస్తూ ఉంటారు. శ్రీ సార్ తనవద్దనున్న Foreseps తో ఆమె కాలులో ముల్లు తీసి ఆమెకు రిలీఫ్ కలిగినంత వరకు ఉండి, పరీక్షకు అర్ధ గంట ఆలస్యంగా వెళ్ళినారు. ఇతరుల బాధలను తనవిగా భావించటం జన్మ సంస్కారంగా లేకుంటే ఇవి సాధ్యమా?

## అధర్మాన్ని, అన్యాయాన్ని చూచి సహించలేక ధర్మం వైపు నిలబడటం

ధర్మాచరణ అయిన ప్రధాన పురుషార్థం సాధిస్తే కానీ ఆధ్యాత్మిక జీవనానికి పనికిరాము అన్న శ్రీ మాస్టారి మాటకు దర్పణం శ్రీ సార్ ఆచరణ. శ్రీ సార్ మానవత్వానికి తోడు, అధర్మం చూడలేక ధర్మం వైపు నిలబడటం సహజ సంస్కారంగా వ్యక్తమవుతుంది.

శ్రీ సార్ చదువుకునే రోజుల్లో ఒక స్టూడెంట్ ఐస్క్రీమ్ అమ్ముకునే అతని వద్ద ఐస్క్రీమ్ బాగా తిని అతనికి డబ్బులు ఇవ్వడు. పైగా ఐస్ బండిని నేలమట్టం చేసే పనికి కూడా పాల్పడతాడు. శ్రీ సార్ ఇది చూచి వెంటనే ఆ స్టూడెంటు ను ఎదుర్కొన్నారు. శ్రీ సారు చిన్నవయసు లోనే ఉన్నా, ధైర్యంగా ముందుకు రావడం చూచి సీనియర్ స్టూడెంట్ ఐస్క్రీమ్ అతనికి డబ్బులు ఇచ్చి వెళ్ళిపోయాడు. అధర్మాన్ని సహించలేకుండటం, తగిన రీతి ధర్మం వైపు నిలబడ్డం శ్రీ సార్ కు మరో సహజ సంస్కారం. ఆలోచించి, ఇతరులు చెబితే చేయాటం కాక ఈ ధర్మాచరణ సహజ సిద్దం కావటం ఈ సంఘటనలు తెలుపుతాయి.

మరోసారి రోడ్డు మీద ఒక భర్త తన భార్యను విచక్షణ లేకుండా ఆమె ఒంటిపై బట్టలు పట్టించుకోకుండా కొడుతున్నాడు. అందరూ చోద్యం చూస్తున్నారే కానీ కలిగించు కోవడానికి కానీ, ఆమెకు జరిగే అన్యాయం నివారించుటకు ముందుకు రాలేకపోయారు. ఎదుటివారి కష్టం సహించలేని శ్రీ సార్ మాత్రం ఈ సందర్భం చూడగానే ఆ వ్యక్తి పైబడి తోసివేశారు. ఆమె లోనికి వెళ్లి పోయింది. అతను తగాదాకు దిగుతుంటే

సార్ మీ ఇంటి వ్యవహారాలు ఇంట్లో చూసుకోమని బుద్ధి చెబుతారు. ఈ ధైర్యానికి సాహసానికి ఎంతటి మానవత్వ భావంతో పాటు, అన్యాయం ప్రతిఘటించే సంస్కారం జీర్ణమై ఉండాలి ?

## దైవభక్తి - సర్వుల శ్రేయస్సును కాంక్షించడం

శ్రీ సార్ చిన్నతనంలో ఒకసారి వారి టీచర్ దేవాలయాలను బీడు పెట్టడం ఊరికే అరిష్టం అని చెబుతారు. వెంటనే ఆ టీచర్ వద్దకు వెళ్లి దేవాలయాలను బీడు పెట్టటం అంటే ఏమో కనుగొని ఊరంతా భిక్ష చేసి నూనె, చక్కెర, బియ్యం మొదలైనవి అన్నీ సేకరించి దేవాలయంలో రోజు భజన, అభిషేకం జరిగేలా చేస్తారు, మరియు చూశారు. ఎవరు బోధిస్తే వచ్చిన దైవభక్తి ఇది ? నరనరాల్లో సర్వులశ్రేయస్సు, దైవభక్తి ఉండకుంటే ఇంతటి ఆచరణ సాధ్యమా? అలానే సెకండ్ వరల్డ్ వార్ లో ఎందరో యుద్ధ వీరులు గాయపడ్డారని విని వారి సహాయ నిధి కై ఊరంతా తిరిగి వంద రూపాయలు సేకరించి పంపిస్తారు. కళ్ళు, చెవులు, చేతులు మూసుకుని కూర్చోవడం ఆధ్యాత్మికత కాదు అనే నానుడి కి శ్రీ సార్ జీవనం ప్రత్యక్ష ఆచరణాత్మక బోధ.

## జ్ఞాన తృష్ణ - ధర్మాచరణకు పటిష్టత -- శ్రీ మాస్టారు దర్శనం

శ్రీ సార్ కు వాళ్ల పక్కింటి వాళ్ళకి మధ్య కొన్ని అడుగుల స్థలం సరిహద్దు వివాదం వస్తుంది. అధర్మమే అయినా అతని పక్షమే ఊరు వారు న్యాయం

చెప్తారు. ధర్మం ఓడిపోయినందుకు శ్రీ సార్ ఒంటరిగా ఊరి చివర, కొండ మీద శివాలయం కి వెళ్లి అచట దేవునితో వివాదం పెట్టుకొని విలపిస్తారు.

కొద్దిరోజులకు శ్రీసార్ కు (వాళ్ల ఊరిలో భాగవతం ప్రవచనం చేయడానికి వచ్చిన) భరద్వాజ మాస్టర్ దర్శనము లభిస్తుంది. శ్రీ మాస్టారు ప్రశ్న అడగమని, అడిగిన ప్రశ్నకు సమాధానంగా సార్ జేబులో అందరి మహాత్ముల చిరునామాలు పెడతారు. ఆ తర్వాత నుండి ప్రతి వారం (ఆదివారం) భరద్వాజ మాస్టర్ సన్నిధికి విద్యానగర్ వెళ్లకుండా ఉండలేకపోతారు. కారణం శ్రీ మాస్టారి జ్ఞానవాహిని, వారి వద్ద అనుభవం అయ్యే తృప్తి, శాంతి అని చెబుతారు. ఇట్టి ఆధ్యాత్మిక జ్ఞానం మానవత్వం ఆచరణలో జీర్ణించుకున్న శ్రీ సార్ తో రంగరించి ఎంతటి మార్పు తీసుకు వచ్చిందో మనం శ్రీ మాస్టారు బోధామృతంలో చూడవచ్చు.

మానవత్వం-ధర్మాచరణకు, ధర్మాచరణ-నిత్యజీవితంలో సద్గురుని సేవకు గల అవినాభావ సంబంధం సార్, శ్రీ మాస్టర్ నుండి చూచి నేర్చుకున్న ఆచరణ, మనకు అందించిన అమూల్య సందేశం అనిపిస్తుంది.

**సద్గురు సేవ - ధర్మాచరణకు సుసాధ్యం చేసే సాధనం:**

లౌకిక సౌఖ్యాలను త్యజించి (లెక్కచేయక) సద్గురు సేవకు ఉద్యుక్తులు కావడం, సద్గురుకృపను లౌకిక సౌఖ్యాలకు వాడుకోకుండటం, ఇట్టి ధర్మాచరణ నిర్దిష్ట నవ్వడానికి మార్గము, అని శ్రీ సార్ ఆచరణ తెలుపుతుంది.

శ్రీ సార్ టీచర్ గా (ఉద్యోగ) ధర్మంలో విమర్శలకు-ఒత్తిడులకు వెరువక కాపీలు కొట్టకుండా చూడడం, వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చాక కూడా నాలుగు నెలలు పాఠాలు చెప్పడం మొదలైనవి ధర్మాచరణచేయటానికి (జరగాలంటే) సుఖాన్ని ఎలా త్యజించారు, కష్ట సుఖాలకు ఎలా చలించ కూడదో తెలుపు తాయి.

శ్రీ సార్ కు కలిచేడు లో చక్కని ఇల్లు అన్ని వసతులు ఉన్నా, వదలుకొని స్వామి ఆజ్ఞ మేరకు గొలగమూడి లో నివాసం రావటం సద్గురు సేవలో ఇష్ట-అఇష్టాలు వదలి హృదయపూర్వకంగా శరణాగతి చేయడం ధర్మాచరణ నిర్దిష్టంగా చేసే మార్గం అనిపిస్తుంది.

శ్రీ మాస్టారు ధర్మాచరణ సాధ్యం కావడానికి అందరిలో నేను-నేను అని వ్యక్తమయ్యే చైతన్యం అభేదము అనే ఎరుక, గుర్తు తో వ్యవహరించటం సహజము కావలి అంటారు. “ఇతరులు నీకు ఏమి చేయాలనుకుంటున్నావో అది నీవు ఇతరులకు చేయి, ఇతరులు నీకు ఏమి చేయకూడదు అనుకుంటున్నావో, నీవు ఇతరులకు అది చేయకు” అన్నది ధర్మము అంటారు. నేను-నాది అనే భావాలు ఇట్టి ధర్మాచరణకు విఘాతాలు అని మాస్టారు చెబుతారు.

శ్రీ సార్ సద్గురు సేవలో (భేద భావాలు) రాగద్వేషాలు వహించిన అతికొద్ది సన్నివేశాల్లో స్వామి బోధ తో సరిచేయటం, సద్గురువు ఎంతటి అప్రమత్తం తో వుంటారో సచ్ఛిష్యుడు ఎంతటి శ్రద్ధతో పశ్చాత్తాప-ప్రాయశ్చిత్త లలో

ఆశ్రయించాలో తెలుపుతుంది.  ఒకరికి కాలు తీసేసారని విని సార్, చెప్పిన అతనికి షేక్ హ్యాండ్ ఇస్తారు. వెంటనే శ్రీ స్వామి శ్రీ సార్ కు ఆత్మలో ఎరుక కలుగజేస్తారు. అంతేకాక మరురోజు ఉదయం సార్ కు అలారం మ్రోగక పూజకు లేట్ కావడం, సార్ స్వామి ఇది విమర్శకూ వేసిన శిక్ష అని తెలుస్తుంది.  ధర్మాచరణకూ విఘాతమైన భేద భావం పోగొట్టుటకు సద్గురు సేవ ఏకైక మార్గం అని, ఎలా సహకరిస్తుంది అని తెలుపుతుంది ఈ సంఘటన.

దర్గా స్వామిని  వెంకయ్య స్వామి మందిరంలోకి తీసుకు వచ్చారన్న నెపం తో స్వామి పూజ నుండి తొలగించినా సార్ వారిపై భేదభావం వహించక ఉండటం, పైగా ఆశ్రమ నిర్వహణ కు  ధ్యాన మందిరం కట్టించి ఇవ్వడం రాగద్వేషాల స్థాయిని దాటిన శ్రీ సార్ సద్ధర్మాచరణ తెలుపుతుంది.

## సద్గురు శరణాగతే,  సద్దధర్మాచరణ సహజ సిద్ధం చేసే మార్గం

ధర్మాచరణలో భాగంగా ఆశ్రమ ధర్మాలు పాటించడం అన్ని రూపాలలో ఒకే దైవం ఉన్నారని వ్యవహరించటం సర్వ గతమైన చైతన్యంపై నిరంతర ఎరుక ముఖ్యం అని చెబుతారు.  శ్రీ స్వామికి శరణాగతి చెందిన శ్రీ సార్ బాధ్యతలు అన్నీ స్వామి పూర్తి చేయడం “గురుస్తుతి” లో చూడగలం.  సుమతి అక్కకు seat  ఇప్పించడం, ఉద్యోగం ఇప్పించడం వివాహం చేయడం మొదలైన అన్ని బాధ్యతలను,  శ్రీ సార్ స్వామి ఆజ్ఞానుసారం గొలగమూడి లో స్వామి సేవలో ఉంటూనే ఎలా అద్భుతంగా చేయించినది చూడవచ్చు. మనకు

సద్గురుసేవ-శరణాగతి ధర్మాచరణను సుసాధ్యం చేసే మార్గం అని తెలుపుతుంది.

అట్లే శేషయ్య బాధ్యత స్వామి వహించడం, సార్ కుటుంబ అవసరాలకు ఏ లోపం లేకుండా బియ్యము అక్షయం చేయడం, పొయ్యి కు కట్టెలు అయిపోతే (గొలగమూడి లో) బండి ఇంటికి పంపించడం, మొదలగునవి ధర్మాచరణలో సద్గురు సాయం తెలుపుతాయి.

మానవత్వం, దైవభక్తి, ధర్మాచరణ తో ఆరంభమైన శ్రీ సార్ జీవనము, జ్ఞాన తృష్ట, ధర్మాచరణ, సద్గురుసేవ సంపూర్ణ శరణాగతి లతో మనందరికీ దీప శిఖ వలె మార్గదర్శకంగా నిలవడమే కాక, మానవత్వము-ధర్మాచరణ ఆధ్యాత్మిక జీవనానికి నాంది, ప్రధాన పురుషార్థము అని మరొక్కసారి హెచ్చరిస్తుంది. అట్టి మార్గంలో మన అందరినీ నడిపించ మని ప్రార్థిస్తూ

-సాయి

## భక్తుల అనుభవాలు

శ్రీ పెసల సుబ్బరామయ్య సార్ తో చీర్ల అనంతలక్ష్మి గారి అనుభవాలు

8sep21

1. 2002 సం|| మొదట్లో గాని 2001సం|| చివర్లో గాని నేను, మా నాన్నగారు, మా చెల్లి శ్రీదేవి మద్రాసు వెళ్ళి తిరుగు ప్రయాణంలో గొలగమూడి వచ్చాం. స్వామి దర్శనం చేసుకొని సాయిమాష్టర్ నిలయంనకు వచ్చేసరికి హారతి అయ్యి శ్రీ సుబ్బరామయ్య గారి సత్సంగం

జరుగుతోంది. ఒకళ్ళో యిద్దరో ఉన్నారు. సత్సంగంలో స్వామి యిచ్చే చీటీల ప్రస్తావన వచ్చిందనుకుంటా. నేను వింటూ స్వామి చీటీలపై స్వామి హస్త స్పర్శ ఉంటుందికదా. అవి ప్రసాదించేటప్పుడు స్వామి ఏమి అనుకుంటూ ఉండొచ్చు... యిలా ఆలోచిస్తున్నాను. సార్‌తో, “స్వామి వ్రాసిచ్చిన చీటీలు ఎవరైనా దాచుకున్నారాండి?” అని మాత్రం అడిగాను. కొంత మంది దగ్గర ఉన్నాయిని చెప్పారు.

సత్సంగం అయిపోయింది. సార్ వాళ్ళింటికి వెళ్ళిపోయారు. ఒక అరగంటలోపు వాళ్ళ అబ్బాయిగారు వచ్చి, “సార్ మీకు చూపించమన్నారు“ అని నాకు ఒక చీటీ యిచ్చారు. అది స్వామి సార్‌కి వ్రాసిచ్చినది. ఒక చిన్న పుస్తకంలో ఒక పేజీసైజు. దాంట్లో 4లైన్లు ఉన్నట్టు గుర్తు. చదవచ్చో లేదో అనుకుంటూ సార్ పంపించారని చదివేశాను. చీటీ వ్రాసిచ్చిన date, place గుర్తులేవు. చివరి లైను చదివి ఆశ్చర్యపోయాను. అది సార్‌కి ఈ జన్మలోనే ముక్తి వస్తుంది అని స్వామి వ్రాసిచ్చారు. అప్పటి వరకు స్వామి కష్టాలు తీర్చిన లీలలే విన్నాను. ముక్తికూడా స్వామి చాలా సులువుగా యిస్తారని ఆశ్చర్యపోయాను.

ఆ తరువాత నేను ఎప్పుడు గొలగమూడి వచ్చినా, సార్‌ని చూచినప్పుడు ఎప్పుడో ఈయనకు ముక్తి వచ్చేస్తుంది అనుకునే దానిని. కాని ఆయన అప్పటికే జీవన్ముక్తులని నాకు తెలీదు.

2. 2006 సం|| స్వామి ఆరాధనకి నేను బెంగుళూరు నుంచి మా నాన్నగారు హైదరాబాద్ నుంచి వచ్చాం. ఆరాధన రోజు August 24న మధ్యాహ్నం సాయిమాష్టర్ నిలయంలో 1st floor లో భోదనలు అయ్యాక

నాకు దాహం వేస్తోంది. Blue color డ్రమ్ములలో నీళ్ళు చూస్తే అడుగుకు ఉన్నాయి. డ్రమ్ముల మీద ఈగలు కూడా ఉన్నాయి, దాంతో నేను మంచి నీళ్ళు త్రాగలేదు. ఏమనుకున్నానో గుర్తులేదు, బయట కొనుక్కోని త్రాగలేదు. 1గంట గంటన్నర అయింది. దాహం ఎక్కువగానే ఉంది.

సార్ సాయిమాష్టర్ నిలయంలో బయట అరుగు మీద (యిప్పుడు ఉన్న మేడి చెట్టు నీడలో) కొంత మంది పిల్లలతో సత్సంగం చేస్తున్నారు. నేను కూడా కూర్చుని వింటున్నాను. కొద్దిసేపటికి సత్సంగం మధ్యలో ఆపి "ఇక్కడ ఎవరికి దాహం వేస్తుంది?" అని అడిగారు. ఎవరికైనా దాహం వేస్తుంటే చెప్తారు వాళ్ళు అనుకున్నాను. ఎవరూ చెప్పలేదు. అప్పుడింక నాకు దాహం వేస్తుంది అని చెప్పాను. అక్కడున్న పిల్లలలో ఒకరికి ఒక కుండతో నీళ్ళు పెట్టి దీని మీద మూత, గ్లాస్ కూడా పెట్టమన్నారు.

సత్సంగం తరువాత ఒక పెద్ద మట్టికుండ తో నీళ్ళు, మూత, గ్లాస్ పెట్టారు. నేను కూడా మంచి నీళ్ళు త్రాగాను. పైన దాహం ఎవరికి అని అడిగిన క్షణం నుంచి ఈయనకు ఎలా తెలిసింది అనుకుంటూ ఉన్నాను. స్వామి సార్ కు చెప్తాడేమో అనుకున్నాను, కాని ఒక వారం రోజులు ఈ ప్రశ్న తరుచూ వచ్చేది. తర్వాత అప్పుడప్పుడూ గుర్తొచ్చేది ఎలా తెలిసింది అని కాని జవాబు తెలీలేదు.

3. బెంగుళూరు తిరిగి వెళ్ళిపోయాక ఒకవారం రోజులకు ఒక కల వచ్చింది. దాంట్లో సార్ పడిపోయి నడవలేకుంటే ఆయనను పిల్లలు కొంతమంది ఎత్తుకొని బ్రహ్మంగారి మఠం రోడ్డులో నుండి స్వామి మందిరం రోడ్డులోనికి

తీసుకొస్తున్నారు. వాళ్ళింటికి తీసుకొని వెళ్ళడానికి అన్నట్లు. ఇలా కలగన్నానే అని ఆయన ఎలావున్నారో అని అనుకుంటూ ఉండేదాన్ని.
దగ్గర దగ్గర సం||రానికి 2007 సం|| లో గొలగమూడి వస్తే బ్రహ్మంగారి మఠం దగ్గరకు సత్సంగం ఉంటుందని వెళితే ఎవరూ రాలేదు. అక్కడ వున్న సరోజనమ్మగారు సార్ పడిపోయారు రావట్లేదన్నారు. 2017 లో సార్ సమాధి అనంతరం వెలువడిన పుస్తకంలో సార్ పడిపోవడం, యింటికి తీసుకువెళ్ళడం వర్ణన నాకు కలలో కనిపించిన దానికి సరిపోయింది.

4. ఎప్పుడు గొలగమూడి వచ్చినా మాష్టారి నిలయంలో, బ్రహ్మంగారి మఠంలో సత్సంగం వింటాం. సత్సంగంలో చాలా ఆనందంగా ఉంటుంది. 4:30 గ||ల తర్వాత బెంగ వచ్చేది. యింకో అరగంటలో సత్సంగం అయిపొతుందని. యింటికి వెళ్ళే రోజు మళ్ళీ ఎప్పుడు గొలగమూడి వస్తామో ఎప్పుడు సత్సంగమో అనుకునేదాన్ని.

5. 2008 సం|| గాని తర్వాత గాని (సం|| సరిగా గుర్తులేదు) ఒకసారి దర్గాస్వామి కలలో ఎక్కడో "అనంత కళ్యాణ మండపం కడుతున్నామని చెప్పారు. నేను చెప్పానని సుబ్బరామయ్య గారి దగ్గరకు వెళ్ళి ఆయన చేప్పిన పని చెయ్యి" అన్నారు. నేను ఏదో కల వచ్చింది అనుకున్నాను గాని, సుబ్బరామయ్య గారికి చెప్పలేదు. పని చేయడం అంటే డబ్బు ఖర్చు. కలలో ఏదో వచ్చిన అనంత కళ్యాణ మండపం నిజంగా వస్తుందా అనుకున్నాను. నిజంగానే నెల్లూరులో ఒకటి నీలకంఠరావు పేట లో ఒకటి అనంత కళ్యాణ మండపాలు ఉన్నాయని తెలిశాక కల నిజం అనుకున్నాను.

దర్గా స్వామి, సార్ యిప్పుడూ నిత్యసత్యులై ఉన్నారు కనుక, మళ్ళీ పొరపాట్లు చేయకుండా కాపాడమని ప్రార్ధిస్తున్నాను.

6. 2019 సం|| మార్చి అనుకుంటా... నాంపల్లి బాబా గుడికి వెళ్తున్నాను. 2004సం||లో నేను hyderabad వెళుతున్నానని చెబితే నాంపల్లి బాబా దర్శనం చేసుకోమని సార్ చెప్పారు. నేను వెళ్ళే ప్రయత్నం చేయలేదు. 2008 నుంచి చాలాసార్లు దర్శనానికి వెళ్ళాను.

2019సం|| మార్చిలో సార్ చెప్పింది గుర్తు వచ్చి "మీరు చెప్పినప్పుడు వెళ్ళలేదు. యిప్పుడు వెళ్తున్నాను. మీ ఆదేశం|ఆజ్ఞ|సలహా మేరకు వెళ్ళడం వేరు సొంతగా వెళ్ళడం వేరు. మీరు అప్పుడు చెబితే యిప్పుడు వెళ్ళున్నాను" అనుకుంటూ బాధపడుతూ వెళ్ళాను. ఆ రోజు సార్ కలలో కనిపించారు.

7. 2014సం|| అనుకుంటా సార్ తో చివరిసారి మాట్లడడం చూడడం. నాకు సార్ చెప్పినది... రోజూ ఒక టైం అనుకొని నిర్ణీత సమయం తప్పకుండా స్వామికి యివ్వమని.

ఈ నియమాన్ని నేను 2017సం|| వరకు ఆచరణలో పెట్టలేదు. 2017లో మొదలు పెట్టాక సుమారు 6 లేక 7 నెలల తరువాత ఒక రోజు 15ని||లు లేట్ అయ్యాను అనుకున్న టైంకి. ఆరోజు రాత్రి సార్ కలలో "ఎంతొస్తుంది అని అడిగారు.నేను నా శాలరీ .చెప్పాను. ఒక సం||లో సంపాదించాల్సింది నీకు యింత ....పట్టింది" అన్నారు. తరువాత ఒక జామ చెట్టు ఉంది. దాని కొమలు 3/4 వంతులు తయారయినాయి. సార్ ఒక కత్తి

తీసుకొని జామ చెట్టు మొదలు నుంచి 2 లేద 3 అడుగులు కాండం ఉంచి పైన అడ్డంగా నరికేశారు.

మెలకువ వచ్చాక నియమం తప్పినందుకు కనిపించారు అనుకున్నాను. కాని కల సరిగా అర్ధం కాలేదు. యింటిలో కల గురించి చెప్పినప్పటి నుంచి రోజు 5ని||లు ముందే కూర్చో అన్నారు. తప్పకుండా అందరూ రోజూ గుర్తు చేస్తారు.

అనంతలక్ష్మి గారికి ఒకరోజు కలలో ఆమెకు సార్ దగ్గర కూర కలిపిన అన్నం పెట్టారు. స్నానానికి కాలవ దగ్గర చెయ్యమన్నారు. ఆటోలో ఆమె వెళ్లారు. పంట బాగా పండింది. ఆ పంట మీద నుండి ఆటో చక్రాలు వెళుతున్నాయి. అప్పటి నుండి గొలగమూడి వెళదామని అనిపిస్తున్నది.

## సార్ తో (సాయి శివ డైరి విషయాలు)

16/07/2004:

నిన్నంతా అల్లకల్లోలంగా ఉన్న మనస్సు  నిన్న రాత్రి సార్ ను ప్రార్ధించడం వల్ల మాస్టర్ పటం  కేసి చూసి సార్ 'మేము మేము మాత్రం ఎన్నాళ్లైనా ఇలాగే ఉంటాం.  మీరేం చేస్తున్నారు నేను వెధవ అయితే చూస్తూ మీరు ఊరుకుంటున్నారా' అని 'అయినా నియమం పాటించినప్పుడు నేను పాటించడంవల్లా? లేక మీరు చేయించడం వల్లా?  ఖచ్చితంగా మీ సంకల్పమే కాబట్టి ఇప్పుడు నేను పాటించకపోయినా అడ్డంగా ఉన్న నేనేమీ బాధపడి ప్రయత్నించను. నువ్వు ఏం చేస్తే అది చెయ్యి. మీరు సంకల్పిస్తే క్షణంలో మారదా నా మనస్సు! అనుకున్నాను అద్భుతంగా ఈ రోజు నా

ప్రయత్నం ఏ మాత్రం లేకుండా ఆయన మనసును పూర్తిగా మార్చారు. "కంట్రోల్ అంతా నా చేతిలో ఉంది" అని తెలియపరచమేమో!

నా ప్రార్థనలు భావాలూ గమనిస్తున్నారని మంచి అనుభవం ప్రసాదించారు. నిజంగా సార్ పరిచయం లేకుంటే జీవితం ఎలా ఉండేది? ఇష్టం వచ్చినట్లు తింటూ, ఇంద్రియ లోలుడనై కాలము, ధనము, శక్తి, బుద్ధి అన్నీ నాశనం చేసుకుంటూ అహంకారంతో హీనాతిహీనంగా ఉండేవాడిని. సార్ చూపే ప్రేమే వారి వద్దకు లాక్కుంటోంది. వారు చూపే కరుణే ఉత్సాహాన్నిస్తోంది. వారు తమ శక్తి ధారపోసి నడిపించడం వల్ల ఈ మాత్రం ఉండగలుగుతున్నాను. ఎంతో కఠోర సాధనతో, నియమ పాలన తో సార్ ఆర్జిస్తున్న తపశ్శక్తి ఊరికే ధార పోస్తున్నారు. దానికి ఎంత కృతజ్ఞుడనై ఉండాలి? సార్ పై ఎంత ప్రేమ ఎప్పుడూ ఉప్పొంగుతూ ఉండాలి? ఎన్నిసార్లైనా ఏమాత్రం విసుక్కోకుండా ప్రేమతో అవే విషయాలు మళ్ళీ మళ్ళీ చెప్పి నడిపించటం ప్రపంచంలో ఎవరు చేస్తారు? అవసరం ఏముంది? నా బాగోగులు తో వారికి ఏమిటి సంబంధం? అదే కదా వారి దివ్య ప్రేమ

19/07/2004:

విద్యానగర్ గొడవల అన్నింటి గురించి అయిపోయిన తర్వాత మాస్టారు ఒక కామెంట్ చేశారట "వాళ్ళ వాళ్ళ పాత్రలు వారు సరిగ్గా వేయలేదు సుబ్బరామయ్యా!" అన్నారు

17 లేదా 18 జులై 2004:

సార్ చెప్పిన విషయాలు అధర్మం జరుగుతుంటే నిగ్రహించే శక్తి ఉండి కూడా చూస్తూ ఊరుకోవడం వలన తగిన పాపఫలం మన నెత్తికి ఎత్తక

మానదు - ప్రకృతి. ఏమీ చేయలేక పోయినా కనీసం మన discontentment (అసంతృప్తి) అయినా వ్యక్తపరచాలి. ఇట్లాంటి పాపాలన్నీ పేరుకొని నెత్తికి చుట్టుకుని కళ్ళారా చూస్తున్నా హృదయం తగువిధంగా స్పందించదు. వారిని గుర్తించలేని దౌర్భాగ్యులుగా ఉండిపోతాము. స్వామిని ఒక ఊరిలో కట్టేసి కొట్టడం, ఆ వూరి వారిలో ఒకరు మాత్రం రాత్రి వచ్చి కట్లు విప్పి, స్వామిని పంపించడం. మరురోజుకు ఊరంతా తగలబడిపోయి, ఆ ఒక్క వ్యక్తి ఇల్లు మాత్రం చెక్కుచెదరలేదుట. ఆ వ్యక్తి ఇప్పటికీ బ్రతికే ఉన్నారు అని ఆ ఊరి పేరు, వ్యక్తి పేరు కూడా చెప్పారు. రోశిరెడ్డి ఒకసారి అధర్మపరుని వాదం ఖండించి ధర్మపరునికి మద్దతునిచ్చి వచ్చినప్పుడు స్వామి "నీకు ఈ రోజుకు ఆరు లోకాలు వచ్చాయని" చెప్పారు. అలాగే ఏదైనా మాటుంటే మాట్లాడిపోయ్యా! అని యుద్ధానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం. మౌనం అనే ముసుగులో నోరు విప్పకుండా అధర్మం జరుగుతున్నా ఊరుకోవడం చాలా తప్పు.

24/11/2004

జయమ్మ గారు జయ చంద్రారెడ్డి గారు వచ్చి శ్రీ దర్గా స్వామి గొలగమూడిలో కళ్యాణ మండపం కట్టించాలని అందరి వద్ద సంతకాలు చేయింపజేయగా వీరు కలెక్టర్ కు ఇచ్చి వచ్చామని చెప్పారు. సార్ వారితో "అమ్మా! దర్గాస్వామితో చెప్పండి - ఒక వృద్ధాశ్రమం కట్టించమని. ఈ కళ్యాణ మండపం ఎందుకు? ఉన్న వాళ్ళు వచ్చి పెళ్లి చేసుకు పోతారు. ఎవరికీ పనికిరాదు. ఇక్కడ తలదాచుకుననే నీడ లేక వృద్ధులకు ఇబ్బందిగా ఉంది. బ్రతికి ఉండగానే చాపలో చుట్టి కోనేరు కట్టమీద పెట్టారు. ఒక ఆమె వచ్చి నాతో చెప్పగా పోయి చాప విప్పి చూస్తే ప్రాణం ఉంది. ఇలాంటి ఘోరాలు జరక్కుండా ఉంటే తల దాచుకోను నీడ ఉంటే అందులో పడుకుంటారు" అని చెప్పారు. జయ చంద్రా రెడ్డి గారు 'సార్! మీరే రాసి ఇవ్వండి మేము

తీసుకుపోయి ఇస్తాము. మేము ఆయనకు చెప్పే ధైర్యం లేదు' అన్నారు. సార్ ఏమీ మాట్లాడలేదు.

# సార్ లెటర్స్

## 30-05-2005 న సాయికి: త్రికరణ శుద్ధి తో ధర్మాచరణ - కర్మ సుకౌశలం

గొలగమూడి
30-05-2005

డియర్ సాయి,

ఈరోజు ప్రపంచమంతా అంధకార బందురంగా ఎంతో దుఃఖములో మునిగి వుంది. ఒకవైపు తాము చేసే పనులన్నీ తమకు సుఖసంతోషాలను తెచ్చిపెడతాయని వారు ఆ పనుల ద్వారా దుఃఖాన్నే తెచ్చుకుంటున్నారు. రోగాల ద్వారా, నష్టాల ద్వారా, వ్యాజ్యాల ద్వారా, దొంగతనాల ద్వారా కష్టం కలిగినప్పుడు అలాంటి నష్టం కలిగించిన వారే తమ దుఃఖానికి కారణమని మొత్తుకుంటారు. కానీ వాళ్లు చేసిన కర్మలే అందుకు కారణమని ఏ మాత్రము తలంచరు కదా. ఒక కాంట్రాక్టరు లక్షలు కోట్లు సంపాదిస్తున్నారు. ఎట్లా సంపాదిస్తున్నాడు? కేవలం సత్యం ధర్మం తప్పి నడుచుకుని మాత్రమే. పదిమందికి ఉపయోగపడే రోడ్డు వేయమంటే ఇంజనీర్లకు లంచాలు ఇచ్చి రోడ్డు అద్వానంగా వేస్తున్నాడు. అలా ఆర్జించిన ధనం దుఃఖము కలిగించక ఏమి చేస్తుంది?

**శ్రీ స్వామివారు బోధించిన సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ ఎంత గొప్ప పచ్చి సత్యాలో కదా**. **అందరూ ధర్మం తప్పి సుఖ సంతోషాలు పొందాలని చూస్తారు. కానీ ఆ వచ్చిన సుఖ సంతోషాలు చూస్తుండగానే దుఃఖాలు అవుతున్నాయి**. టీచరు పాఠం చెప్పడు. విద్యార్థి చదవడు. డాక్టర్ తన వృత్తిలో నైపుణ్యము కొరకు శ్రమించి చదవడు. పేషంటు మందు సేవించకుండానే ఆరోగ్యము పొందాలని చూస్తాడు. ఎంతోమంది ఆధ్యాత్మిక పేపరు పేరుతో ధనము ఆర్జిస్తున్నారు. ఆధ్యాత్మికత గోరంత కూడా ఆ పేపర్ లో కనిపించదు. **ఎవరి ధర్మం వారు త్రికరణ**

**శుద్ధిగా ఆచరిస్తే వారికి కలిగేదంతా ఆనందమే. అలా ధర్మాచరణ చేయాలంటే ఆనందం అనేది బాహ్యంగా వస్తువుల నుండి రాదు. అది మన అంతరంగాల లోనే ఉంది. అది మనం పొందాలంటే ఇష్టం, అయిష్టం సమూలంగా పోవాలి. ఇష్టాఇష్టాలు పోవడం అంటే భగవంతుడు మనకిచ్చిన పని నూటికి నూరుపాళ్లు శ్రద్ధగా ఆచరించడం ఒక్కటే మార్గము.** (నీకు ఇప్పుడు) భగవంతుడు అనుగ్రహించిన పని చదువు- పి హెచ్ డి. దానిని నీవు ఇష్టాఇష్టాలు లేకుండా అది నీ ధర్మంగా భావించి సాధిస్తే తరుగులేని ఆనందం శాంతి లభిస్తాయి.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

## 27-06-05 న సాయికి: తృప్తి,శాంతి - ధర్మము లో, గురువు ఇచ్చిన పని తో

గొలగమూడి,

27-06-05.

Dear Sai,

ప్రతి మానవుడు సుఖశాంతులతో తృప్తిగా జీవించాలని తలుస్తాడు. కాని అట్టి సుఖము, శాంతి, తృప్తి అనునవి మనం ఆచరించే ధర్మము వలన మాత్రమే లభిస్తాయని ఎన్ని శాస్త్రాలు ఘోషించినా, మహాత్ములు అందరూ ఎలిగెత్తి చాటినా ఆశాబద్ధుడైన మానవునకు అట్టి ఆచరణ దుస్సాధ్యం అయ్యింది. అట్టి ధర్మాచరణ మన నిత్య జీవితంలో సహజ సిద్ధమయ్యేందుకు మహనీయుల సాంగత్యం ఒక్కటే శరణ్యమని భగవద్గీతాది గ్రంధాలన్నీ చెబుతున్నాయి. వారి ప్రత్యక్ష సానిధ్యము లభించనప్పుడు మహాత్ముల చరిత్ర పారాయణ కూడా మహాత్ముల ప్రత్యక్ష సానిధ్యంతో సమానమని ఎందరో భక్తుల అనుభవాలు ఋజువు చేస్తున్నాయి. మహనీయుల చరిత్ర

పారాయణ ద్వారా అనేక మంది భక్తులలో కలిగిన హృదయ పరివర్తనే ఇందుకు నిదర్శనము. అట్టి ధర్మాచరణను గూర్చి శ్రీ స్వామివారు ఏనాడు పెద్దగా ఉపన్యసించకున్ననూ శ్రీ స్వామి వారి నిత్య జీవిత సంఘటనల నుండి ఇట్టి ధర్మభోధ వినగలిగిన వారికి అనుక్షణమూ వినిపిస్తూనే ఉంటుంది.

శ్రీ స్వామివారి గురువు వారికి ఒక పని ఒప్పగించి చేయమన్నారు. అదే ఇతరుల బాధలను తన తపోశక్తితో క్షాళన చేయడం. ఇతరులు అంటే మానవులే కాదు సర్వ జీవుల యొక్క బాధలు తీర్చడం. ఆ కృషిలో నిమగ్నమై తన శరీరాన్ని మరచిపోయి పని చేసారు. మన గురువు మనకొక చిన్న పని పెట్టారు. ఆ పనిలో నిమగ్నమై మనం ప్రపంచాన్నే మరచిపోవాలి. ఆ పని తప్ప ఇతర యోచనలే ఉండకూడదు. ఒక రోజు నాకు మందిరం కట్టగా మిగిలిపోయిన రాతి ముక్కలను కంకర కొట్టించమన్నారు. ఆ విషయం రేపటి లెటర్ లో వ్రాస్తాను.

స్వామి వారి ఆశీస్సులతో

పె. సు.

********* సద్గురు దేవా శరణం శరణం *********

## 14-01-2004 న Nayak గారికి : ఉద్యోగ నిర్వహణలో ధర్మాచరణ

ఓం

గొలగమూడి, 14-01-2004

Dear Nayak garu !

ప్రతి జాబు లోను పూర్తి అడ్రసు వ్రాస్తుండు. నేను ఎవ్వరి అడ్రసులు వ్రాసి పెట్టను. ఈ జాబులో పూర్తి అడ్రసులేదు.

బాబా భక్తులు ఇలాంటి లెక్కలు వ్రాయడం తప్పే. మీరు సాయికి చెప్పండి. నన్నిక్కడికెందుకు తెచ్చావు ప్రభూ, నన్ను సరైన తావులో ఉంచండి అని చెప్పుకోండి. మీ పెద్ద ఆఫీసర్లతో ఈ లెక్కల పని లేకుండా చేయమని అడగండి. తప్పు లెక్కలు వ్రాయడం నా చేత కాదని నిష్కర్షగా చెప్పండి. రూ||100 జీతం తగ్గించైనా సరే లెక్కలు నాకు లేకుండా చేయమని అడగండి.  సర్వానికి బాబా నే మనకు దిక్కని విశ్వసించండి. ఆయనే మార్గము చూపుతారు.

నమస్కారములతో
పెసల సుబ్బరామయ్య

--------- సద్గురు దేవా శరణం శరణం ---------

## భవాని గారికి: బిడ్డలను పెంపకం లో ధర్మాచరణ - సంస్కారం, సంతోషం

మాకు నాన్నగారు ఉన్నన్ని రోజులు మా అమ్మ నిత్యం వడ్లు దంచి మాకు హరిజనవాడలో గంపలో తీసుకుపోయిన సామానులు అమ్మి తెచ్చిన వడ్లు దంచి మాకు అన్నం వండిపెట్టేది. మరి ఈనాడు ఇంత ప్రయోజకులమైనామంటే అది మాతల్లితండ్రులు మాకిచ్చిన ఆస్తిపాస్తుల వలన వచ్చినవి కావు. **గనుక నీవు నీ బిడ్డల భవిష్యత్తు ఎట్లా? ఆస్తిపాస్తులు లేకుంటే? అని చింతించవద్దు. వారికి మంచి సంస్కారము చక్కని విద్యాబుద్ధులు నేర్పించు. నీ రెక్కల కింద పెంచి పెద్ద చెయ్యి. ఇతరులకు సహాయం చేసే బుద్ధిని వారికి ఉగ్గుపాలతో పెట్టిన విద్యగా చేస్తుండు. ఏ వస్తువునే గాని, ధనమునే గాని వృధా చేయరాదనే సంస్కారము నేర్పు. ప్రతి వస్తువు భగవంతుడు సృష్టించినదే. అది మన చేతికి భగవంతుడు ఇచ్చింది తోటి మానవులకు అది లేని వారికి అందించేదానికి కానీ, దానిని మితిమీరి అనుభవించేందుకు కాదనే విషయం వారికి బాగా నేర్పు. బాబా ఏమి చేశారు. తన బిక్షతో జీవిస్తూ తననాశ్రయించిన వారికి సర్వసౌకర్యాలు అమర్చేవారు.** అర్ధరాత్రి వచ్చిన అతిథులకు అన్నం పెట్టమని రాధాకృష్ణమాయి ఇంటికి పంపేవారు. ఎన్నో మిఠాయిలు పండ్లు వస్తే బిడ్డలకు పెట్టేందుకు భక్తులకు ఇచ్చేవారు. మనము అలాగే ఉండేందుకు ప్రయత్నించాలి. **అందరిని మంచి వసతి గృహాలకు పంపి తను మాత్రము**

**పాడుబడ్డ మసీదులో ఉన్నారు. అది మనము నేర్చుకోవలసినది. ఇతరులకు ఇవ్వడంలో సంతోషం పొందాలి. అప్పుడు దైవకృప కలుగుతుంది**. చిన్నప్పుడు మా మేనత్త ఇచ్చిన పాతగుడ్డలు నేను హుందాగా ధరించి సంబరపడేవాడిని. మరి ఇప్పుడు కొత్తబట్టలే ఒకరికి ఇవ్వగలిగే స్థితిలో ఉన్నాను. ఇది మా తల్లిదండ్రులు నాకిచ్చిన ఆస్తిపాస్తులు వల్లనా అమ్మా! 11వక్లాసు (SSLC) పాసై పదిరూపాయలు తీసుకొని మా తల్లిగారి ఆశీస్సులతో మద్రాసు వెళ్లాను. ఆ పది రూపాయలు రానుపోను చార్జీలకు సరిపోతాయి. మరి మద్రాసులో హాస్టల్లో చేరేందుకు తిరగాలి. చార్జీలకు డబ్బులేదు. కాలి నడకే. అన్నం అసలు లేదు. అలాంటి స్థితిలో నుండి ప్రస్తుత స్థితికి ఎదిగాను. ఇది కేవలం దైవకృపే. ఆ దైవకృపకు ఒకటే కారణమని నా నమ్మకం. చిన్ననాటి నుండి ఎందుకో తెలియని దైవభక్తి. గ్రామములోని పాడుబడ్డ దేవాలయంలోని శ్రీరాములు విగ్రహానికి తోటి పిల్లలందరినీ తీసుకుపోయి అభిషేకం చేసేది. అలాగే గ్రామదేవతకు చేసేది. సాయంకాలం గరుడగుమ్మం తీసుకుని ఇంటింటికి తిరిగి నూనె భిక్ష ఎత్తి దేవాలయంలో దీపం పెట్టే వాళ్ళము. మమ్మల్ని చూసి ఒక భజనబృందం తయారయింది. మాకు ఒక హరిజన టీచరు వచ్చారు. నా పుస్తకాలు చూసి ఆయన మహా ఆశ్చర్యచకితుడైపోయాడు. వాటిని ఎంత జాగ్రత్తగా వాడేవాడినో, ఆయనే నన్ను పై చదువులు చదవమని ప్రోత్సహించి, మావాళ్లు ఆర్థికంగా అసక్తులు అయితే అన్నం తినకుండా నిరాహార దీక్ష చేయమని సలహా ఇచ్చారు. అలా చేస్తే విధిలేక ఒకసారి ఏడో తరగతిలో చేర్చారు.

**ఇదంతా ఎందుకు చెప్పానంటే మనం చేసేది ఏమీ లేదు. అంతా దైవప్రేరితమే. మీరు చింతపడవద్దు అని చెప్పేందుకు**.

ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య.

శ్రీస్వామివారు చెప్పింది ఎంత సత్యమో "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా". ఒకరోజు ఒక ఆమె శ్రీస్వామివారి వద్ద చీట్లు వేసింది. అందులో తన ఆశకు భిన్నంగా చీటీ వచ్చింది. శ్రీ స్వామివారిని కాదనలేక చాలా స్వల్పంగా శ్రీ స్వామివారి ఆజ్ఞ నామమాత్రంగా నెరవేర్చి, ఆ తర్వాత తన ఇష్టం నెరవేర్చుకుంది. అది ఎంత అపచారము వారికి తెలియదు. **అసలు చీటీలు**

**పెట్టి ఆ మహనీయుని సలహా కోరడం ఎందుకు? తన అభీష్టమునకు భిన్నంగా వస్తే ఎట్లా అనే ఆలోచన ముందే ఉండాలి. తీరా వారు ఆజ్ఞాపించాక మనం వారి మాటను పాటించకపోవడం ఎంత అపచారం. మీరెప్పుడూ అలా చేయవద్దు.**

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

[07-11-2001 న: ఆలోచన—ఆనందమయ జీవితం—ధర్మమే భగవంతుడు]

గొలగమూడి,

07-11-2001

డియర్ సర్,

కాలాన్ని బట్టి ధర్మాలు మారుతాయి. ఆ రోజులలో బ్రహ్మచారి ధర్మాలు అలా ఉండేవి. ఈ రోజులలో అందరూ అలా నడచుకోవటం కుదరదు. గురువు చెంత వేదాధ్యయనం చేయడం, సమావర్త హోమం చేయడం ఈ రోజులలో అందరికీ సాధ్యం కాదు. కానీ ప్రతివారు ధర్మబద్ధంగా నడచుకోవడం అనే ధర్మం ఆదరణపూర్వకంగా ఆచరించినట్లయితే వారి జీవితాలు ఎంతో ఆనందంగా ఉంటాయి.

మన ఆలోచనలు, పనులు, మాటలు అనుక్షణం భగవంతుడు సాక్షీభూతుడుగా రికార్డు చేస్తున్నాడనే సత్యాన్ని సంపూర్ణంగా నమ్మి నడుచుకోవాలి. ఆ అమ్మాయి విషయంలో నీవు తప్పుగా భావన చేసివుంటే ఆ తప్పును క్షమించమని బాబాను ప్రార్థించు. నీవు చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా వరుసగా రెండుపూటలు భోజనం చేయకుండా ప్రార్థనలో ఉండు. ఆ కరుణామయుడు క్షమిస్తాడు. ఆమెకు నిజంగా వివాహమైనదని ఈ పాటికి తెలిసిపోయి ఉంటుంది కదా? ఆనందమయమైన జీవితం కావాలని కోరుకోవడంతో సరిపోదు. మానసికంగానూ, క్రియా రూపంలోనూ, వాచకరూపంలోనూ ధర్మ బద్ధంగా అనుక్షణం జీవించడం అలవాటు చేసుకోవాలి. ఆమె మన చెల్లెలే అయివుంటే మరొకరు నీలాగ ప్రవర్తిస్తే నీకెలా ఉంటుందో ఆలోచించు. గనుక మరలా అలాంటి

పొరపాటు చేయనని బాబాకు చెప్పుకో. మరొకసారి పొరపాటు పడకుండా నడచుకో. ధర్మమే జగతికి మూలం. ధర్మమే భగవంతుడు.

********* సద్గురు దేవా శరణం శరణం *********

## నిత్య సత్యులు శ్రీ సార్ తో అనుభవము

శివరత్నానికి ఆగస్ట్ 23 రాత్రి కలలో సార్ శివరత్నంతో "నగేష్ కి ఒంట్లో బాగోలేదు. ఏవో మందులు వాడుతున్నాడు. రెండు మాత్రలు పేర్లు చెప్పి వాటిని వేసుకోమని చెప్పు" అని అన్నారు. తరువాత ఉదయం Sivaratnam ఆ విషయాన్ని పట్టించుకోలేదు. పైగా శ్రీ వెంకయ్య స్వామి ఆరాధనలో ఉండటం వల్ల ఆ విషయాన్ని మరిచిపోయాడు. 26 వ తారీఖు భోజనం చేసి మిద్ది మీద నడుస్తున్నప్పుడు గుర్తు వచ్చి నగేష్ కి ఫోన్ చేసాడు. అప్పటికి నగేష్ కి జ్వరం తగ్గిపోయింది. సార్ శివరత్నంకి కలలో చెప్పిన ఒక మందు నగేష్ కూడా వేసుకున్నాడు. అంటే సార్ నిర్నిద్రులై గమనిస్తూ, తన నస్రయిమ్చిన వారు ఎప్పుడెప్పుడు ఏమేమి చేయాలో సార్ స్ఫురింప చేస్తూ - చేయిస్తూ కాపాడుతున్నారు.

సాయి సుబ్రహ్మణ్యం సామాన్యంగా ఉదయం 6:30 కానీ 7 గంటలకు కానీ నిద్ర లేస్తాడు. ఆగస్టు e-మ్యాగజైన్ లో ఎడిటోరియల్ (సంపాదకీయం) వ్రాయటానికి రెండు రోజులు మాత్రమే ఉంది. ఒకరోజు ఉదయం 4 గంటలకు నిద్ర లేపి సార్ ఆగస్ట్ ఎడిటోరియల్ dictate చేస్తున్నట్లు వ్రాయించారు. ఎడిటోరియల్ బాగా వచ్చింది. పోతన గారికి గజేంద్ర మోక్షం లో వైకుంఠం వర్ణన తెలియక గుల్లమల్లాలు పడుతుంటే సాక్షాత్తు మహా విష్ణువే వచ్చి ఆ పద్యాలు పూరించినట్లు, పామరులమైన మనను అజ్ఞానంతో గురుసేవలో లోపాలు జరగకుండా మరల మరల ఎరుక, ఆత్మ ప్రేరణ కల్గిస్తూ నడిపిస్తున్నారు.

******సద్గురు దేవా శరణం శరణం *******



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# మహాత్ముల వాక్యాలు

- ధర్మం,  ధర్మం, ధర్మం, ధర్మమే భగవంతుడు.  - From Sir Letters
- No man has the right to cook food, only for himself. It is for others and he should have what remains.  - From complete works of Swami Vivekananda
- The more we come out and do good to others, the more our hearts will be purified and God will be in them.  - From complete works of Swami Vivekananda

******సద్గురు దేవా శరణం శరణం *******